
# నిర్ణయం




## శ్రీమతి న్యాయపతి కమలారాంజీ

**పవన్ అశ్వని వైపు చూశాడు. సరిగ్గా అదే సమయంలో అశ్వని కూడా పవన్ వైపు చూసింది.**

**ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.**

**ఆ చూపులు ఏ మౌనభాషను మాట్లాడుకున్నాయో వాళ్ళిద్దరికీ తప్ప మరెవ్వరికీ తెలియదు. పెళ్ళి చూపులకి ముందే అతను రాసిన ఉత్తరం అశ్విని చాలాసార్లు చదువుకుంది. కానీ ఆ ఉత్తరం గురించి ఇంట్లో ఎవరికీ చెప్పలేదామె. అన్నపూర్ణ కళ్లకు పవన్ బాగానే కనిపించాడు. 'హమ్మయ్య' అనుకుని నిట్టూర్చింది.**

అసలు పెళ్ళివారొచ్చిన దగ్గర్నుంచీ అన్నపూర్ణకి టెన్షనే. ఇప్పటికి ఎన్నో సంబంధాలు చూశారు. ఏ సంబంధం కుదరలేదు. పెళ్ళి చూపులు పూర్తయి పిల్ల నచ్చిందని చెప్పి వెళ్ళినవారు జతకాలు పడలేదని కబురు చేసేవారు! ఇంచుమించు అన్ని సంబంధాలు అలాగే తప్పిపోయాయి. అందుకే ఈ పెళ్లివార్ని చూసిం దగ్గర్నుంచీ ఆవిడ గుండె ఉద్వేగంతో వేగంగా కొట్టుకోసాగింది.

"మీ అమ్మాయి మాకు నచ్చిందండీ. మాకు కట్నం అక్కర్లేదు. జాతకాల పట్టింపు కూడా లేదు. మీకున్నది ఒక్కతే కూతురు. మా తమ్ముడికిచ్చి చేస్తే పెళ్లిలో ఏలోటూ చెయ్యరనే మేం అనుకుంటున్నాం." అంది పవన్ అక్క. పవన్ ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ల అక్క, బావ వరంగల్లులో వుంటున్నారు. అతనికి తల్లిదండ్రులు లేరు.

అన్నపూర్ణ భర్త రామచంద్రం స్టేట్‌బ్యాంక్ ఆఫీసరు. కూతురి పెళ్ళి చూపుల టైంకి ఉందామంటే దగ్గర్లో వున్న చిన్న బ్రాంచ్‌కి ఇన్‌స్పెక్షన్‌కి వెళ్ళాల్సి వచ్చింది. వచ్చేసరికి చాలా రాత్రయిపోతుంది. మర్నాడుదయం పెళ్ళి చూపులు చేద్దామంటే పవన్ అక్క, బావలు వప్పుకోలేదు.

"మా తమ్ముడికి శలవు లేదు. వెళ్ళిపోవాలి" అని తొందరచేశారు. అందుకే పవర్ కట్ టైములోనే పెళ్ళి చూపులు తప్పలేదు. అన్నపూర్ణ కొడుకు అభినవ్ కలకత్తాలో ఉద్యోగం చేస్తు న్నాడు.

పెళ్ళివారు కరెంటు వచ్చిందాకా కూడా కూర్చోకుండా ఇంకా ఎక్కడికో వెళ్లాలంటూ లేచి వెళ్ళిపోయారు.

అమ్మాయి వాళ్ళకి నచ్చిందనగానే అన్నపూర్ణ సంతోషంతో వుక్కిరిబిక్కిరయింది. దగ్గర్లోనే ముహూర్తాలు పెట్టించమని చెప్పి వెళ్ళారు వాళ్ళు. ఇక ఆలస్యం చేస్తే ఈ సంబంధం కూడా తప్పిపోతుందేమోనని పురోహితుణ్ని పిల్చి ముహూర్తాలు పెట్టించారు.

పెళ్ళి ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోతున్నాయి. ఆ ఇంటికి అప్పుడే పెళ్ళి కళ వచ్చేసింది. శుభలేఖలు ప్రింటయిరావడం, వాటికి పసుపు అంటించి పోస్టు చేయడం కూడా అయిపోయింది. పై ఊర్లలో వున్న దగ్గర బంధువులకి ముందుగానే పెళ్లికి రమ్మని ఉత్తరాలు వెళ్ళిపోయాయి. కొంత మంది అప్పుడే వచ్చేశారు కూడా. ఊర్లో వున్న తెల్సినవాళ్లలో సగం మందికి పెళ్లి పిలుపులు కూడా అయిపోయాయి. పెళ్లి ఇంకా పదిరోజు లుంది.

పెళ్లి పన్లు చేస్తున్నా కూడా అన్నపూర్ణ ఆలోచనలు కూతురి చుట్టూ తిరుగుతున్నాయి. తన కూతురని చెప్పడం కాదు గానీ అశ్విని చక్కని చుక్క బుద్ధిమంతురాలు. అయినా ఏ సంబంధమూ కుదరకపోవడానికి బలమైన కారణం వుంది. అది...ఆమె జాతకంలో వున్న కుజదోషం! అశ్విని అదృష్టం బాగుండి ఇన్నాళ్లకు జాతకాలు పట్టింపులేని వాళ్ళు దొరికారు. అదొక పెద్ద ప్లస్ పాయింట్ వాళ్లకి. పైగా పవన్ బి.ఇ. తర్వాత ఎమ్.బి.ఎ. చేసి ఢిల్లీలో ఓ పెద్ద కంపెనీలో ఫైనాన్స్ మేనేజరుగా మంచి పోస్టులోవున్నాడు. అంతకంటే ఏం కావాలి? అన్నపూర్ణ సంతోషానికి పట్టపగ్గా ల్లేవు. అశ్విని ఫ్రెండ్స్ చాలామంది ఫోన్‌లోనే కంగ్రాట్స్ చెబుతున్నారు. అన్నపూర్ణ క్కూడా ఆ ఊర్లో చాలామంది తెల్సిన వాళ్లున్నారు. అది కాక బంధువులు కూడా బాగానే వున్నారు ఆ ఊళ్ళో. ఫోన్‌కాల్స్ వరుసగా వస్తున్నాయి ఆవిడకి. అంతమంచి ఉద్యోగం చేస్తున్న అల్లుడు దొరికినందుకు అవతలవాళ్ళు ఆవిడకి కంగ్రాట్స్ చెబుతున్నారు. అభి కూడా చెల్లెలి పెళ్ళి కోసమని శలవు పెట్టుకుని వచ్చాడు. అన్నపూర్ణ చాలా హడావుడిగా కూతురికి పెట్టాల్సిన సారె సామన్లు కూడా రెడీ చేస్తున్నది.

ఆ రోజు ఇంట్లో వున్న వాళ్లంతా ఎవరి పన్ల మీద వాళ్ళు బయటకు వెళ్లారు. ఫోన్ రింగయింది. అన్నపూర్ణ ఫోన్ ఎత్తింది.

"హలో! నేను కాత్యాయని... మాట్లాడుతున్నాను."

స్నేహితురాలి గొంతు వినగానే అన్నపూర్ణ

సంతోషంతో "ఎక్కడికెళ్ళిపోయావే ఇన్ని రోజులూ! నేనే నీకు ఫోన్ చేసి ఈ శుభవార్త చెబుదామను కుంటున్నాను. మన అశ్వినికి పెళ్ళి నిశ్చయమైంది తెలుసా? మరో నాలుగు రోజుల్లో ముహూర్తం!"

"అవునే పూర్ణా! నాకు ఇందాకే తెల్సింది ఈ విషయం. మా పెద్దబ్బాయికి వంట్లో బాగు లేదంటే వెళ్ళాను. సరేకానీ, మీ అల్లుడు..ఎవరి అబ్బాయి? ఏమిటి?"

అన్నపూర్ణ చెప్పింది సంబరపడిపోతూ.

ఒక్క క్షణం నిశ్శబ్దం.

అన్నపూర్ణకి అనుమానం వచ్చి కాత్యాయని ఫోన్ పెట్టేసిందేమోనని "హలో..." అంది.

"ఆఁ పూర్ణా! నువ్వా అబ్బాయిని సరిగ్గా చూశావా?"

"ఏం అలా అడుగుతున్నావు? నేను చూశాను. కుర్రాడు బాగానే వున్నాడు." అంది అన్నపూర్ణ ఆశ్చర్యపోతూ.

"ఏం లేదు. నీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు. పెళ్లి ఇంకా నాలుగు రోజులుందంటున్నావు. ఇప్పుడు నీకా విషయం చెబితే ఎలా రియాక్ట్ అవుతావోనని భయంగా వుంది."

అన్నపూర్ణకి అప్పటికే ముచ్చెమటలు పోసేస్తున్నాయి.

"ఏ విషయం?" నీరసంగా అంది అన్నపూర్ణ.

"అదే... పెళ్ళికొడుకు విషయంలో మీరు తొందరపడకండి. అబ్బాయిని మరోసారి బాగా చూసి అప్పుడు ఏ నిర్ణయానికైనా రావడం మంచిది."

"అసలు సంగతేమిటో చెప్పు కాత్యాయనీ!"

కాత్యాయని చెప్పింది. విన్నాక ఆమెకి పక్కలో బాంబు పడినట్లుగా, తన శక్తినంతా ఎవరో లాగేసినట్లుగా, నిస్సత్తువగా అయిపోయి అక్కడే నేలమీద చతికిలపడిపోయింది. గుండెలోంచి వుప్పెనలా ముంచుకొస్తున్న దుఃఖాన్ని పెదవి చివర అదిమి పెట్టుకుని తనకు తాను కంట్రోలు చేసుకుంది. మెల్లగా లేని ఓపిక తెచ్చుకుని లేచింది. పేపరు చదువుతున్న భర్త దగ్గరకి వెళ్ళి తను విన్నది, జరిగింది చెప్పింది. ఆమె చెప్పింది విని రామచంద్రం తెల్లబోయాడు.

"ఇప్పుడెలా? పెళ్ళి ఏర్పాట్లన్నీ చేసేశాం!"

"ఏం చేద్దాం? ఇప్పుడు కర్తవ్యం ఏమిటి?"

అభి అన్నాడు – "నాన్నగారూ! అమ్మ చెప్పింది కన్‌ఫర్మ్ చేసుకోవాలంటే ఒక్కటే మార్గం వుంది. పెళ్లికి వారం రోజులు ముందుగానే అతను వాళ్ల అక్కబావల ఇంటికి వచ్చేస్తాడని విన్నాం. మనం వరంగల్ వెళ్తే అన్ని విషయాలు తెలుస్తాయి..."

అన్నపూర్ణకి పిచ్చెత్తినట్లుగా వుంది.

తను, తన కూతురు ఏం పాపం చేశారని విధి తమ జీవితాలతో ఇలా ఆటలాడుతోంది? పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి...

తండ్రీ కొడుకులిద్దరూ ఊర్నించి వచ్చేశారు.

"మనం విన్నది నిజమే. ఈ పెళ్ళి క్యాన్సిల్ చేద్దాం" అన్నారు వాళ్లిద్దరూ.

"ఇంత పీకల మీదకి వచ్చాక ఇప్పుడు పెళ్లి క్యాన్సిల్ అంటే ఎంత అవమానం! అప్రతిష్ఠ! ఎంత డబ్బు నష్టం?" కోపంతో, బాధతో చిందులు తొక్కుతున్నది అన్నపూర్ణ.

"నిజాన్ని దాచిపెట్టి వాళ్లు మనల్ని మోసం చేశారు" రామచంద్రం బాధగా అన్నాడు.

"అందుకే కాబోలు సరిగ్గా పవర్‌కట్ టైం చూసుకొని వచ్చారు. కరెంటు వచ్చిందాకా వుండమంటే ఉండకుండా వెళ్ళిపోయారు" అభికి పెళ్ళివారి మీద చాలా కోసం వచ్చింది.

"జరిగిందేదో జరిగిపోయింది. ఇహ జరగా ల్సిన పెళ్లి ఆపటం మన ప్రస్తుత కర్తవ్యం!" రామ చంద్రం అన్నాడు.

అప్పుడు అశ్విని వచ్చిందక్కడికి. ఆమె చేతిలో వుత్తరం వుంది.

"అమ్మా! ఈ పెళ్లి ఆపకండి. నేను అతన్నే పెళ్లి చేసుకుంటాను. ఈ ఉత్తరం చదవండి. ఇందులో అతను చేసిన మోసమేమీ లేదు. పెళ్లి చూపులకి ముందే అతను నాకు రాసిన ఉత్తరం ఇది.

రామచంద్రం ఉత్తరం చదువుతుంటే చెరొక వైపు అన్నపూర్ణ, అభి నించుని ఆ ఉత్తరాన్ని చదివారు.

"అశ్వినిగారూ!

నా ఉత్తరం చదివాక మీరు ఆశ్చర్యపోతారని, అసహ్యించుకుంటారనీ నాకు తెలుసు. అందుకే అక్క, బావ వారిస్తున్నా వినకుండా, వాళ్లకి తెలియకుండా వాస్తవాన్ని మీ ముందుంచాలనే సదుద్దేశంతో నేనీ ఉత్తరం రాస్తున్నాను. ఏడాది క్రితం కారు యాక్సిడెంట్‌లో కాలు పోగొట్టుకున్న నేను కృత్రిమ కాలుతో, జీవితంలో పోగొట్టుకున్న ఆనందాన్ని తిరిగి పొందగల్గాను. దేవుడు అందరికీ అన్నీ ఇవ్వడు. అన్నీ ఇచ్చేస్తే మనం ఆ దేవుణ్ని మర్చిపోతామని ఆ దేవుడి భయం. జీవితం పంచు కోవాల్సిన వారి దగ్గర నిజాన్ని దాచిపెట్టడం నేరం అవుతుంది. అందుకే నేను ఈ విషయాన్ని ముందుగానే తెలియజేస్తున్నాను. మీకు మన స్ఫూర్తిగా ఇష్టమైతేనే నా జీవితంలోకి అడుగు పెట్టండి. నిర్ణయం తీసుకునే ముందు బాగా ఆలోచించుకోండి.

ఇట్లు
పవన్"

ఆ ఉత్తరం రాసే విధానాన్ని బట్టి చూస్తే పవన్ నిజాయితీ అద్దం పడుతోంది. పాపం విధివంచి తుడైన పవన్ లాంటి వ్యక్తికి చేయూతనివ్వడం నిజంగా హర్షించదగ్గ విషయమే!

అశ్విని అందరివైపు ఒకసారి చూసి నెమ్మదిగా అంది. "నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చాను. నా అదృష్టం బాగు లేకపోతే రేపు పెళ్ళ య్యాక అతనికి యాక్సిడెంటయి కాలు పోగొట్టుకుంటే మనమేం చెయ్యగలం చెప్పండి! నాకు ఆదర్శం అంటే ఏమిటో తెలియదు. అలాంటి పరిస్థితిలో వున్న వ్యక్తిని ఆదుకోవడానికి, మనో ధైర్యం కల్పించడానికి, ఓదార్పు అందించడానికి నా జీవితాన్ని అంకితం చెయ్యడంలో ఎంతో తృప్తి ఉందని నేను భావిస్తున్నాను. నా సుఖం గురించి మీరు ఆలోచించకండి. నేను సుఖంగానే వుంటాను. నేనేదో త్యాగం చేస్తున్నానని నేననుకోవ డం లేదు. మీరు కూడా అలాంటి భావన మనసులోకి రానివ్వకండి. మన సమస్యకి పరిష్కా రం ఇదే. మంచితనాన్నే ఊపిరిగా పీల్చు కుంటున్న మనలాంటి వాళ్ళు తీసుకోవాల్సిన సరియైన నిర్ణయం ఇదే!


మొదటి చూపులోనే ప్రేమించాం అంటారు కొంతమంది. నాకు అలాంటివి తెలీవు. నాది ప్రేమ కావచ్చు. అభిమానం కావచ్చు. లేదంటే బాధ లోంచి ఎగిసిపడ్డ బలమైన నిర్ణయం కావచ్చు. ఏదిఏమైనా నా నిర్ణయం మాత్రం మారదు" ఆమె మాటలు దృఢంగా, ఖచ్చితంగా వున్నాయి.

ఆదర్శం వల్లించడం సులభం. కానీ ఆచరించ దం కష్టం! మామూలుగా ఉండే ఆ అమ్మాయిలో ఎన్ని ఆదర్శ భావాలున్నాయి. ఆమెది ఎంత లోతు హృదయం. ఆమె తీసుకున్న నిర్ణయం. మహిళలకే గర్వకారణం! త్యాగ నిరతితో ఆమె ఎంచుకున్న బాట అమ్మాయిలందరికీ వెలుగుబాట!

అన్నపూర్ణ ఆశ్చర్యంగా కళ్లింతలు చేసుకుని చూస్తోంది కూతురి వైపు. "ఈ కాలం పిల్లలకి ఉద్రేకమే తప్ప జీవితపు విలువలు తెలీవను కున్నాను. కానీ నా కూతురు మానసికంగా ఎంత ఎదిగిపోయింది?" అనుకుంది మనసులో.

మంగళ వాయిద్యాల మధ్య పవన్ అశ్విని మెడలో మూడు ముళ్ళు వేశాడు. ఆ దృశ్యం చూడ గానే ఆ దంపతులిద్దరి కళ్ళు చెమ్మగిల్లాయి. ❋

## చిరునవ్వు



చిరునవ్వు
నా గుండె గుడారపు
ముసుగు తెరచి
పెదాలమీద
దరిహించే లోపే
మధ్యస్థంగా మటుమాయమైంది!
వ్యవస్థ అవస్థనా
నా నాడీ వ్యవస్థ అస్వస్థమనా
నవ్వడానికి నా ప్రయత్నాలు
నేను చేస్తూనే వున్నాను!
మీరూ సహకరించండి!!

– గుడిమెట్ల గోపాలకృష్ణ